క్లుప్తంగా

సింగరేణి జీఎంకు ఆత్మీయ వీడ్కోలు



హనుమంతరావును సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో 34 సంవత్సరాలు వివిధ హోదాలలో, వివిద ఏరియాలలో పనిచేసి నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న బి.హనుమంతరావును గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీఎం వెల్ఫేర్ బీఆర్ దీక్షితులు, ఏజీఎం గోనె శ్రీకాంత్, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, ఆల్బర్ట్, పీతాంబరం, అజయ్‌కుమార్, డీజీఎం వేణుగోపాల్, వరప్రసాద్, తిరుపతి, బి.సునీల్‌కుమార్, మాల కొండయ్య, హరిశంకర్, బందెల విజేందర్, సకినాల సమ్మయ్య, సుమన్, మొగిలిపాక రవి, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలీఖాన్‌కు సన్మానం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం కోర్టు సూపరింటెండెంట్ రషీద్ అలీఖాన్ గురువారం ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ మేరకు జిల్లా కోర్టు ప్రాంగణంలో రషీద్ అలీఖాన్‌ను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, కోర్టు సిబ్బంది అలీఖాన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామిశెట్టి రమేష్, రవి, సురేష్, మీనా కుమారి, ఉషా, బి.సిద్ధార్థ, సాయి, కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణం



పూజలు చేస్తున్న అర్చకులు

ఇల్లెందు: ఇల్లెందు – కారేపల్లి మండలాల సరిహద్దు గ్రామం తొడిదెలగూడెం గ్రామం వద్ద 132 ఏళ్ల క్రితం వెలిసిన శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం స్వామి వారిని ఊరేగింపుగా తీసుకొచ్చి వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా కల్యాణం జరిపించారు. ఇల్లెందు, కారేపల్లి మండలాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు ఐకాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు ఐకాన్ అవార్డు లభించింది. ఈనెల 26న ఆదివారం హైదరాబాద్ బిర్లా ప్లానిటోరియల్‌లో మెగా ఎంటర్‌ప్రైజెస్ అధినేత్రి శ్రీమతి శిరీషరెడ్డి ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. విద్యారంగంలో విశేష సేవలు అందించిన వెంకటేశ్వరరావుకు అతిథులు, నిర్వాహకులు సన్మానించి, ఐకాన్ అవార్డు, మెమెంటో అందజేశారు. ఈ విషయాన్ని గురువారం స్థానిక విలేకరులకు అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు తెలిపారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ భాస్కర్‌నాయక్

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ నాయక్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. మాట్లాడుతూ... ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని డాక్టర్, వైద్యసిబ్బందిని ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు శానిటేషన్‌పై అవగాహన కల్పించి, చైతన్య పరచాలని సూచించారు. ఇమ్యూనైజేషన్ ప్రక్రియ ప్రణాళికా బద్ధంగా జరిగేలా చూడాలన్నారు. వైద్యులు, వైద్యసిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని, ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, హెడ్‌నర్స్ వరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ అందని ద్రాక్షేనా?

- దీనస్థితిలో 21పిట్ ఏరియా ప్రజలు
- 'సాక్షి'కథనంతో అధికారుల్లో కదలిక
- ఏరియాలో పర్యటించిన ట్రాన్స్‌కో, సింగరేణి ఉన్నతాధికారులు
- ఓనర్‌షిప్ సర్టిఫికెట్ మెలికపై సర్వత్రా అసంతృప్తి



స్థానికులతో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఎస్ఈ బికాంసింగ్, అధికారులు

ఇల్లెందురూరల్: సింగరేణి ఆవిర్భావం తరువాత మొట్టమొదటగా సంస్థ చేత నిర్మించబడిన క్వార్టర్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. నాడు సింగరేణిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేసిన కార్మికుల కుటుంబాల వారసులు నేడు ఆయా క్వార్టర్లలో నివాసం ఉంటున్నారు. 2015లో నాడు క్వార్టర్లకు విద్యుత్ సౌకర్యం తొలగిస్తామన్న సింగరేణి ఆదేశాలను ప్రశ్నిస్తూ 21పిట్ పరిరక్షణ కమిటీ పేరుతో ఉద్యమం చేపట్టారు. ఫలితంగా నాటి ప్రభుత్వ పెద్దలు వారికి సహకరించి సమస్యను సింగరేణి సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కాలనీకి ప్రభుత్వం ద్వారా విద్యుత్ సరఫరాకు సీఎండీ అంగీకరించారు. ఫలితంగా నాడు ఏరియాలో పర్యటించిన ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు ప్రభుత్వ విద్యుత్ సరఫరాకు రూ.27లక్షలు చెల్లించాలని షరతు పెట్టారు. ఈ నిధులు సమకూర్చేందుకు అటు ప్రజాప్రతినిధులు, ఇటు సింగరేణి ముందుకు రాకపోవడంతో గత్యంతరం లేక సొంతంగా విద్యుత్ మీటర్లను కొనుగోలు చేసిన ప్రజలు సింగరేణి ద్వారా విద్యుత్ సౌకర్యం తీసుకొని ఇండస్ట్రియల్ రేటు ప్రకారం యూనిట్‌కు రూ.6.50 చొప్పున చెల్లిస్తూ వస్తున్నారు. ఒక్కో క్వార్టర్ నుంచి రూ.300 నుంచి రూ.1500 వరకు విద్యుత్ బిల్లుల పేరుతో ప్రజలు సింగరేణికి చెల్లిస్తున్నారు.

'సాక్షి'కథనంతో కదలిక...

తాజాగా గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి పేరుతో 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించి ఆచరణలోకి తెచ్చింది. కానీ సింగరేణి ద్వారా విద్యుత్ సౌకర్యం పొందుతున్న 21పిట్ ఏరియా ప్రజలు గృహలక్ష్మి పథకానికి దూరమై నష్టపోతున్న తీరును వివరిస్తూ 'ఉచిత విద్యుత్ అందేనా'శీర్షికతో ఫిబ్రవరి 27, 2024న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి దూరమైన ప్రజల దుస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించింది. దీంతో గురువారం ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఎస్సీ బికంసింగ్, డీఈ నందయ్య, ఎస్ఏఓ మురళి, ఏఓ గోవర్ధన్, ఏఈ రాము, సింగరేణి ఎస్ఓటూ జీఎం మల్లయ్య, డీజీఎం వర్క్‌షాప్ శేఖర్‌బాబు, ఈఈ పవన్‌కుమార్, బాలాజీ, మహేష్ తదితరులు 21పిట్ ఏరియాలో పర్యటించారు.

ఓనర్‌షిప్ సర్టిఫికెట్ ఉంటేనే..

సింగరేణి ద్వారా ఇండస్ట్రియల్ విద్యుత్ ధరను చెల్లిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నామని, ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకానికి కూడా దూరమవుతున్నామని స్థానికులు అధికారుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇదే విషయం ఎంపీటీసీ పూనెం సురేందర్, అఖిలపక్ష కమిటీ నాయకులు వడ్ల శ్రీనివాస్, తాండ్ర నాగరాజు, క్లింట్‌రోచ్, ధనసరి రాజు, మధు తదితరులు ట్రాన్స్‌కో, సింగరేణి అధికారులతో చర్చించారు. ప్రస్తుతం ప్రభుత్వ విద్యుత్ సరఫరాకు ఎటువంటి అవాంతరాలు లేవని, కానీ ట్రాన్స్‌ఫార్మర్, కొంత లైన్ మరమ్మతులకు నిధులు అవసరమవుతాయని, వాటిని ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తే పనులు ప్రారంభిస్తామని ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఎస్ఈ బికంసింగ్ సూచించారు. గృహలక్ష్మి దరఖాస్తుతోపాటు ప్రజలు నివాసం ఉంటున్న క్వార్టర్లకు ఓనర్‌షిప్ సర్టిఫికెట్‌ను జత చేస్తేనే పథకం వర్తిస్తుందని స్పష్టం చేశారు. దీంతో అక్కడే ఉన్న సింగరేణి అధికారులు ఆ విషయం తమ పరిధిలో లేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పి వెళ్లిపోయారు.

మరో ఉద్యమానికి సిద్ధం...

21పిట్ ఏరియాలో ప్రభుత్వ విద్యుత్ సౌకర్యం సమకూర్చాలని, గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలన్న డిమాండ్‌తో స్థానికులు, అఖిలపక్ష నాయకులు మరో ఉద్యమం చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు నాయకులు విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో సింగరేణి వైఖరి వల్ల ప్రభుత్వ విద్యుత్ సరఫరాకు దూరమయ్యామని, నేడు ఓనర్‌షిప్ సర్టిఫికెట్ పేరుతో ట్రాన్స్‌కో అధికారులు మెలిక పెట్టడం వల్ల గృహలక్ష్మి దూరమవుతోందని వాపోయారు. ప్రభుత్వ విద్యుత్ సరఫరా, గృహలక్ష్మి అమలు లక్ష్యంగా ప్రజలంతా ఉద్యమానికి సిద్ధంగా ఉన్నారని అఖిలపక్ష కమిటీ నేతలు స్పష్టం చేశారు.

కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న టేకులపల్లి సీఐ సురేష్

ఇల్లెందు: దేశంలో నేర, న్యాయ వ్యవస్థలో మార్పులు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు చట్టాలపై పోలీసులకు అవగాహన అవసరమని డీఎస్పీ ఎన్.చంద్రభాను తెలిపారు. గురువారం ఇల్లెందు మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణను డీఎస్పీ ప్రారంభించారు. మాట్లాడుతూ.. భారత న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం – 2023 ఈ మూడు చట్టాలు జూలై 1 నుంచి అమలులోకి రానున్నాయని తెలిపారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఈ మూడు చట్టాలు భారత శిక్షాస్మృతి (ఐపీసీ–1860) క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, సీఆర్‌పీసీ–1973, ఇండియా ఎవిడెన్స్ యాక్ట్ –1872 రీప్లేస్ చేయనున్నట్లు చెప్పారు. ఈ మూడు కొత్త క్రిమినల్ చట్టాలలో సమకాలిన కాలం, వాడుకలో ఉన్న సాంకేతికతలకు అనుగుణంగా అనేక నిబంధనలు చేర్చటం జరిగిందన్నారు. ఈ చట్టాలు నేరస్థులకు శిక్ష పడేలా చేయటం బాధితులకు న్యాయం చేయటంపై దృష్టి సారిస్తాయని పేర్కొన్నారు. వీటిపై అందరికీ అవగాహన ఉండేందుకే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సీఐ, ఎస్ఐ, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


'సీతారామ' నీటిని మళ్లించండి..



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: రోళ్లపాడు ప్రాజెక్ట్‌లోకి సీతారామా ప్రాజెక్ట్ నీటిని మళ్లించి ఇల్లెందు నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకోవాలని ఎన్డీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు, గుండాల ఎంపీపీ ముక్తి సత్యం డిమాండ్ చేశారు. గురువారం ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ న్యూడెమోక్రసీ ప్రతినిధి బృందం ములుగు క్యాంప్ ఆఫీస్‌లో పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. భూగర్భ గనుల ద్వారా బొగ్గు వెలికితీయాలని, ఓసీలను రద్దు చేయాలని కోరారు. ఓసీ వల్ల పంటలు పండించే అవకాశం కోల్పోతున్నట్లు తెలిపారు. సింగరేణి, మున్సిపాల్టీ, గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలని కోరారు. కొమరారం, బోడు మండలాలు తక్షణం ఏర్పాటు చేయాలని విన్నవించారు. వ్యవసాయయ సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతులకు సరిపడా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని విన్నవించారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ



సింగరేణి(కొత్తగూడెం): వేడుకలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు అన్నారు. నెల రోజులు నిర్వహించిన సమ్మర్ క్యాంపు గురువారం రాత్రి ఏరియాలోని కేసీఓఏ క్లబ్‌లో ముగింపు కార్యక్రమం జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎండీ రజాక్, వివిధవిబాగాల అధికారులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: సమ్మర్ క్యాంప్‌లో వివిధ క్రీడల్లో శిక్షణ పొందిన గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఏటీడీఓ చంద్రమోహన్ కోరారు. కిన్నెరసానిలోని గిరిజన క్రీడా మోడల్ స్కూల్‌లో రెండు వారాలపాటు నిర్వహించిన వివిధ క్రీడల సమ్మర్ క్యాంప్‌లో 120 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. గురువారం క్యాంప్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రమోహన్ మాట్లాడుతూ... ఈ క్యాంపులో ప్రత్యేక కోచ్‌లను నియమించి వివిధ క్రీడల్లో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి బి.గోపాల్‌రావు, ఏఎస్ఓ కె.వెంకటనారాయణ, ఎస్.రాంబాబు, హెచ్‌ఎం చందు, పీడీలు వెంకటేశ్వర్లు, రామారావు పాల్గొన్నారు.

ట్రాక్టర్ యజమానులతో సమావేశం



మాట్లాడుతున్న ఎఫ్ఆర్ఓ ప్రసాద్‌రావు

జూలూరుపాడు: స్థానిక ఎఫ్ఆర్ఓ కార్యాలయంలో గురువారం అటవీ ప్రాంత సమీప గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యజమానులతో ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ ఆర్ఓఎఫ్ఆర్ హక్కు పత్రాలు ఉన్న భూముల్లో మాత్రమే ట్రాక్టర్ యజమానులు దుక్కి దున్నాలన్నారు. ఇప్పటి వరకు అటవీ హక్కు పత్రాలు ఉన్న భూములకు ఆనుకొని ఉన్న అటవీ భూముల జోలికి వెళ్లొద్దన్నారు. నిబంధనలు అతిక్రమించి అటవీ భూమిని దున్నిన ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రభుత్వ అనుమతి లేకుండా బోర్లు వేయడం గానీ, విద్యుత్ మోటార్లు పెట్టడం గానీ చేయరాదని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సురారం, వినోభానగర్, కేసుపల్లి, రాంపురం తండా, కొత్తూరు, అక్కినాపురంతండా, గుండెపుడి, భేతాళపాడు, పాపకొల్లు, నల్లబండబోడు గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యజమానులు హాజరయ్యారు. కార్యక్రమంలో డీఆర్ఓ లక్ష్మీనర్సు, ఎఫ్ఎస్ఓలు మల్లయ్య, సలీం, బీట్ ఆఫీసర్లు రేఖ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రత నుంచి రక్షణ కల్పించండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికవాడల్లో అధిక ఉష్ణోగ్రత నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని రామవరం 10వ వార్డ్ కౌన్సిలర్ మునిగడప పద్మ సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కార్మికవాడలకు సమీపంలోని ఖాళీ స్థలంలో కట్టాల్సిన ఇళ్లు రుద్రంపూర్ శివారు ప్రాంతంలో కట్టి, ఇళ్ల మధ్య సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయటం వలన రామవరంలో ఎండల తీవ్రత అధికంగా ఉందని, కొత్తగూడెం ఏరియాలోని 3 ఇంక్లైన్ గరిమెళ్లపాడు ప్రాంతాల్లోనే సుమారు 47 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసిందని, దీనివలన సమీప ప్రాంతాల్లో ప్రజలు ఇళ్లల్లో ఉండలేక పోతున్నట్లు చెప్పారు. కాలనీలలోని రోడ్లపై గంటకోసారి వాటర్ స్ప్రే చేయించాలని కోరారు.

ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): బర్మా క్యాంపునకు చెందిన గుబ్బల సతీష్ ఇటీవల విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతని శస్త్ర చికిత్స కోసం శ్రీనగర్ కాలనీ ఉప సర్పంచ్ రమేష్‌చంద్ రూ.18 వేల సాయాన్ని అందజేశారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా సతీష్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, గుండపనేని సతీష్, కళాబాబురెడ్డి, చాంద్‌పాషా, కాటి నాగేశ్వరరావు, శైలజ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలకు మోక్షం

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందురూరల్: రేపల్లెవాడ గ్రామపంచాయతీలో ఒరిగిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్తు తీగల వల్ల పంట చేలల్లో రైతులకు పొంచి ఉన్న ప్రమాదంపై 'ఒరిగిన విద్యుత్ స్తంభాలు'శీర్షికతో గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనంతో ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ట్రాన్స్‌కో ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈ రవి ఆదేశాలతో లైన్‌మెన్ చలమయ్య యుద్ధప్రాతిపదికన ఒరిగిన స్తంభాలను, వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేశారు.

పోడుభూమిని స్వాధీనం చేయండి

ఇల్లెందు: వేములవాడ గ్రామానికి చెందిన గిరిజన రైతు వేప భిక్షానికి చెందిన పోడు భూమిని గిరిజనేతరుడు కొలు పేరుతో స్వాధీనం చేసుకుని అమ్ముకున్నాడని, అతడి నుంచి భూమి స్వాధీనం చేసుకుని గిరిజన రైతుకు ఇవ్వాలని తుడుందెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాటి మధు కోరారు. గురువారం మాట్లాడుతూ.. 2021 –24 మధ్య భూమిని అమ్ముకున్నాడని, పలుమార్లు ప్రశ్నించినా ప్రయోజనం లేకపోవడంతో ఆ భూమిలో దున్ని పెసర విత్తనాలు చల్లినట్లు తెలిపారు.

నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకోవాలి



డీఆర్ఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చుంచుపల్లి: ఆరుకాలం ఎంతో శ్రమించి, వ్యవసాయ పెట్టుబడికి అప్పు తెచ్చి ఖర్చు పెట్టిన రైతులు నకిలీ విత్తనాలతో ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, రైతులు నష్టపోకుండా నకిలీ విత్తనాలు అమ్మే షాపులను గుర్తించి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలను డిమాండ్‌కు తగ్గట్లు మార్కెట్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) రవీంద్రనాథ్‌కు గురువారం కలెక్టరేట్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో ఎక్కువగా వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నట్లు చెప్పారు. దీంతో విత్తనాలకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో విత్తన వ్యాపారస్తులు అమాయక రైతులు, పెట్టుబడి పెట్టలేని రైతులను ఎంపిక చేసుకుని నాణ్యతలేని విత్తనాలను అంటగడుతున్నారని ఆరోపించారు. కంపెనీ విత్తనాలను బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్ముకుంటున్నట్లు చెప్పారు. పానిశెట్టి వెంకటేశ్వర్లు, లట్టి మురళి, బత్తుల వెంకటేశ్వర్లు, గంధమళ్ల కిరణ్, మాదారపు లక్ష్మణ్, గుండు రాజు, నరేందర్, విజయ్ పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



తనిఖీ నిర్వహిస్తున్న ఏఓ రఘుదీపిక, ఏఎస్సై తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులోని విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో గురువారం వ్యవసాయశాఖ అధికారులు, పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జూలూరుపాడు ఏఓ ఎస్.రఘుదీపిక, ఏఎస్సై బి.తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది కలిసి పురుగు మందులు, విత్తన, ఎరువుల దుకాణాల్లో సోదాలు చేశారు. నకిలీ విత్తనాలు, నిషేధించడబడిన కలుపు మందు విక్రయాలు చేస్తున్నారా?లేదా అని, స్టాక్ బోర్డుపై వివరాలు నమోదు చేశారా? లేదా పరిశీలించడంతోపాటు దుకాణాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. అదేవిధంగా స్టాక్ రిజిష్టర్లు, బిల్లు బుక్స్, ఇన్వాయిస్, విత్తన స్టాక్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను చూశారు. ఏఓ మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న దృష్ట్యా విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేస్తున్నామన్నారు. వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు చేపట్టాలన్నారు. ప్రతీ వ్యాపారి దుకాణంలో లైసెన్స్‌ను ప్రదర్శించాలన్నారు. రైతులు తప్పనిసరిగా డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసి బిల్లులు పొందాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు చేయడంతోపాటు, సంబంధిత వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

విత్తనాలు సకాలంలో అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగా బోనస్ రూ.500, రుణమాఫీ, రైతుబంధు ఎకరాకు రూ.పదిహేను వేలు తదితర హామీలను వెంటనే ఆచరణలోకి తేవాలని కోరారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు తగినట్లుగా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. బుర్ర వెంకన్న, ఆవుల కిరణ్, సూర్నపాక ధర్మయ్య, తులిస్యా, ఇర్ప వెంకటేశ్వర్లు, బానోత్ ఈర్యా, రవి, లక్ష్మయ్య, కృష్ణ పాల్గొన్నారు.

కార్మికులకు స్కిల్డ్ వేతనాలు చెల్లించండి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులోని ఎల్ఎస్ఎన్ కంపెనీలో పని చేస్తున్న బ్లాస్టింగ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ టేకులపల్లి మండల సహాయ కార్యదర్శి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, పీఎఫ్ లెక్కలు తెలియజేయాలని, రెండు జతల యూనిఫాం, ఆస్పత్రి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎల్ఎస్ఎన్ కంపెనీ ఇన్‌చార్జ్ రాజ్ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఎల్ఎస్ఎన్ యాజమాన్యం చెల్లిస్తున్న అన్‌స్కిల్డ్ వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయని ఆవేదన చెందారు. కోల్ ఇండియా కార్మికులకు రోజుకి ఒక్కో కార్మికుడికి రూ.1,199, నెలకు రూ.31.174 చెల్లిస్తోందని, అదేవిధంగా సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న బ్లాస్టింగ్ కార్మికులకు కూడా కోల్ ఇండియా తరహా వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రతీ కార్మికుడికి బ్లాస్టింగ్ కోడ్ ప్రకారం రెండు జతలు ఎరుపురంగు దుస్తులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, సమ్మయ్య, రమేష్, నర్సింహారావు, భద్రం, సక్రు, చారి, రామయ్య, మంగీలాల్, సెట్యా, లాల్ సింగ్, బాబూలాల్, మాన్‌సింగ్, లక్ష్మయ్య, మోహన్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటాల వారధి.. సీఐటీయూ

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక, కర్షక, ప్రజా పోరాటాలకు సీఐటీయూ వారధిగా పనిచేస్తుందని, సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.మధు అన్నారు. గురువారం సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 1970లో సీఐటీయూ ఏర్పడిందని, ఆనాటి నుంచి ఈనాటి వరకు అనేక సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ దేశంలోనే అనేక కార్మిక సంఘాలకు కేంద్రంగా విరాజిల్లుతోందన్నారు.

ఇల్లెందు: సమస్యలతో సతమతం అవుతున్న కార్మికులకు సీఐటీయూ ఎల్లవేళలా అండగా నిలిచిందని సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్ నబీ అన్నారు. గురువారం ఇల్లెందులో కార్మికులు ర్యాలీ నిర్వహించి మున్సిపల్, బిల్డింగ్ వర్కర్స్ అడ్డాల మీద సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నబీ మాట్లాడుతూ.. కార్మికవర్గం సమస్యల సాధన లక్ష్యంగా సీఐటీయూ పోరాడుతుందని తెలిపారు. తాళ్లూరి కృష్ణ, మోహన్‌రావు, నాగరాజు, మహమూద్, వెంకన్న, భద్రూ, వెంకటేశ్వర్లు, సుగుణ, శ్రీనివాస్, చుక్కా రాంచందర్, హుస్సేన్, రాజు, ప్రేమ్, శంకర్ పాల్గొన్నారు.

బొగ్గు రవాణా ప్రారంభించాలి



మాట్లాడుతున్న సారయ్య

ఇల్లెందు: సింగరేణి వ్యాప్తంగా 2023–24లో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామని, ఇందులో ఇల్లెందులో అతి తక్కువ మంది కార్మికులతో 45 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి లక్ష్యానికి గానూ 48.79 లక్షల బొగ్గు ఉత్పత్తి 108 శాతం సాధించటం జరిగిందని, బొగ్గు ఉత్పత్తిలో భాగస్వామ్యమైన కార్మికుల జీవితాలు మాత్రం ప్రశ్నార్థకంగా ఉన్నాయని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ అన్నారు. గురువారం ఇల్లెందులోని ఏఐటీయూసీ కార్యాలయంలో కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. మాట్లాడుతూ.. ఇల్లెందు జేకే ఓసీ బొగ్గు ఉత్పత్తి రాకపోవటం వల్ల కార్మికులను బదిలీలు చేపట్టాలని యాజమాన్యం ప్రయత్నం చేస్తోందన్నారు. కేటీసీ నుంచి బొగ్గు రెండు నెలలుగా బొగ్గు రవాణా లేకపోవటం వల్ల కోల్ హ్యాండ్లింగ్ కార్మికుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందన్నారు. బొగ్గు రవాణా టెండర్ ఆహ్వానించి టెండర్ ఇచ్చిన కాంట్రాక్టర్ ఎందుకు నడపటం లేదని ప్రశ్నించారు. కొంతమంది ఆదిపత్యం చెలాయించేందుకు వర్గాల వారీగా ఏర్పడి బొగ్గు రవాణాకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. బొగ్గు రవాణా చేయించటంలో యాజమాన్యం విఫలమైందన్నారు. ఇల్లెందు ఏరియా జేకే ఓసీ విస్తరణ పనులు జాప్యం జరుగుతోందని తెలిపారు. యాజమాన్యం కేటీసీ నుంచి ఇల్లెందుకు బొగ్గు రవాణా ప్రారంభించి హ్యాండ్లింగ్ కార్మికులను ఆదుకోవాలని కోరారు.

ఇల్లెందు ఏరియాలో నెలకొన్న సమస్యలను తమ పార్టీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, వర్కర్స్ యూనియన్ నేతలు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్‌ల ద్వారా చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు దాసరి రాజారామ్, దేవరకొండ శంకర్, సంజీవచారి, పైడిరాజు, శ్రీనివాస్, అబ్దుల్ గఫార్, రవి, రామారావు, విజయ్‌కుమార్, వివి శ్రీనివాస్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.